క్లుప్తంగా

జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఉపయోగం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేయడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరావు అన్నారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచే అమలవుతున్న సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దసరా, దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులు అమలు చేయడంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు సైతం భారీగా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మీడియా ఇన్‌చార్జి తుమ్మల నారాయణరావు, మొసలగంటి సురేష్ పాల్గొన్నారు.

కల్యాణ మాణిక్యం పుస్తకావిష్కరణ

బాలాజీచెరువు: గాయత్రి సేవా పరిషత్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రంలో సోమవారం కల్యాణ మాణిక్యం పుస్తకావిష్కరణ చేశారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వి.జగన్నాథరావు, ట్రస్ట్ చైర్మన్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి హాజరై మాట్లాడుతూ గాయత్రి పరిషత్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి ధన లాభం చేకూర్చేలా అవకాశం ఉండే కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నామని, హిందూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బాధ్యతతో పాటు సనాతన ధర్మ విలువలు నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు నిర్వహిస్తునామన్నారు. వివాహానికి ముందు తర్వాత యువతకు వినూత్న రీతిలో సైకాలజీ సబ్జెక్టులో శిక్షణ ఇస్తామన్నారు.

విద్యార్థి చదువుకు సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న జయచంద్ర

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన ఓ విద్యార్థి చదువుకి శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందింది. కాకినాడకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త గుత్తుల జయచంద్ర సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా కాకినాడకు చెందిన భవాని కుమారుడు మణికంఠ ఇంటర్మీడియెట్ చదువుకు సాయంగా రూ.25 వేల మొత్తాన్ని అందజేశారు. విద్యార్థి తండ్రి 2019లో ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, దీంతో చదువుకు ఇబ్బంది పడుతున్నారని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ తెలిపారు.

గాయాలు ప్రమాదకరం కావొచ్చు



రోగులను పరీక్షిస్తున్న ఎముకల వైద్య నిపుణులు సూర్యారావు

బోట్‌క్లబ్: పడిపోయినప్పుడు తగిలే గాయాలు కనిపించే దాని కంటే ప్రమాదకరమైనవి కావచ్చునని ప్రముఖ ఎముకల వైద్యులు నిపుణుడు బొండా సూర్యారావు అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ గాయాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పడిపోయినప్పుడు తుంటి పగుళ్లు, తల గాయాలు ఏర్పడవచ్చాన్నారు. ఈ ప్రమాదాలు ప్రాణాంతకరం కావచ్చునన్నారు. వయస్సు పెరిగే కొద్దీ చాలా మందికి సామర్థ్యాలు బలహీనపడడంతో కంటి చూపు మందగిస్తుందన్నారు. కండరాలు క్షీణిస్తాయన్నారు. వృద్ధులు భయం లేకుండా స్వతంత్రంగా జీవించేలా, పడిపోయే ప్రమాదాన్ని తగ్గించేలా ప్రోత్సహించడం పిల్లల బాధ్యతన్నారు.

వ్యర్థాలతో ఉపయోగపడే పరికరాలు

సామర్లకోట: వ్యర్థాలతో ఉపయోగపడే పరికరాలను తయారు చేయవచ్చునని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. ఈనెల 17వతేదీ నుంచి స్థానిక రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా (ఎస్‌హెచ్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్లాస్టిక్ బాటిల్స్‌ను పూల కుండీలుగా తయారు చేశారు. ఈ మేరకు ప్రయాణికులకు స్వచ్ఛతాహీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కల్యాణి, రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా.. దుర్గమ్మా..

- నగరంలో శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు



గాయత్రీ అలంకరణలో దర్శనమిచ్చిన దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



సూర్యారావుపేటలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో మాధవనగర్ కనకదుర్గమ్మ



కరపలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



కరపలో విల్లంబుల అవతారంలో పర్వతవర్ధినీదేవి



బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన ఉషారాజరాజేశ్వరి అమ్మవారు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాలు సోమవారం నగరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు విల్లంబుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రమ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సత్కళావాహిని కృష్ణమాచార్యులు బృందం ఆలపించిన భక్తి గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం నీలాద్రి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి కీర్తనలు, అనంతరం జ్యోతి నృత్య కళానికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. స్థానిక దేవాలయం వీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అసౌకర్యంగా కలుగకుండా ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి లక్ష్మీరాజ్యం, కార్యదర్శి ఎన్‌వీ సాయిబాబా పాల్గొన్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం

కరప: శరన్నవరాత్ర ఉత్సవాలు మండల గ్రామాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లోను, విష్ణాలయం, శివాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ వేడుకలు తొమ్మిదిరోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కరప, వేములవాడ, వేళంగి, కూరాడ, వాకాడ, వలసపాకల నడకుదురు, పెనుగుదురు, అరట్లకట్ట, కొరిపల్లి, పెద్దాపురప్పాడు, పాతర్లగడ్డ, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. కరప దుర్గాదేవి ఆలయంలో భక్తులు విరాళంగా ఇచ్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు త్రిశూలం, చక్రం, అభయహస్తంతో అలంకరించారు. విష్ణాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలోని పర్వతవర్ధినీదేవిగా అలంకరించి, పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ, చీర్ల శ్రీనివాస్ అన్ని ఏర్పాట్లు చేశారు. కరపలోని మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గ ఆటోయూనియన్, గ్రామస్తులు నిర్మించిన ఆలయంలో విజయదుర్గను నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడకుదురులోని జట్టువని వారు, గ్రామస్తులు దుర్గాదేవిని నిలిపి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగుదురులోని సంతోషమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా రాజరాజేశ్వరీదేవి

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడిలోని భానులింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉషారాజరాజేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ప్రథమ చికిత్స పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని, తనకే కాకుండా ఇతరులు ఆపదలో ఉంటే రక్షించేందుకు వీలు ఉంటుందన్నారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రథమ చికిత్స శిక్షకుడు చిన సత్యనారాయణ మాట్లాడుతూ తేనేటీగలు కుట్టుడం, పాము కాటు, విష ప్రయోగం, పొగలో చిక్కుకుపోవడం, నీటిలో మునగడం, ఉరి వేసుకోవడం, గొంతులో వస్తువులు చిక్కుకోవడం, కరెంట్ షాక్, పిడుగుపాటు, తేలుకాటు, తల మీద గాయాలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిలో బాధితులను రక్షించేందుకు డీఆర్ఏబీసీ అనే ఫార్ములా గురించి వివరించారు. అలాగే సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీధర్, సభ్యులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, సూర్యనారాయణ, వాసంశెట్టి రాజేశ్వరి, విజయానంద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా రోటరీ సేవలు



రోటరీ ఫౌండేషన్‌కు వంద డాలర్ల చెక్కు ఇస్తున్న క్లబ్ సీనియర్ సభ్యుడు సాయిబాబు

బోట్‌క్లబ్: రోటరీ ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నామని రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సీనియర్ సభ్యులు లంక సాయిబాబు రోటరీ ఫౌండేషన్‌కు 100 డాలర్లు విరాళం చెక్కును సోమవారం క్లబ్ అధ్యక్షుడు గోపీనాథ్‌కు అందజేశారు. సభ్యులు 100 డాలర్ల చొప్పున రోటరీ ఫౌండేషనుకు విరాళం అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న రోటరీ క్లబ్‌ల ద్వారా సమాజానికి శాశ్వత ప్రాజెక్టులను నిర్మించి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఫౌండేషన్ సేకరించిన నిధుల ద్వారా పోలియో మహమ్మారిని ప్రపంచవ్యాప్తంగా నిర్మూలించిన ఘనత రోటరీకే దక్కుతుందన్నారు. మిత్రుల ద్వారా కూడా ఫౌండేషన్‌కు విరాళాలను సమకూర్చాల్సిందిగా కోరారు. టరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ డిడక్షన్ వ్యాన్ నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలను క్యాన్సర్ బారిన పడకుండా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.శ్యామ్, బ్లడ్ బ్యాంకు కమిటీ చైర్మన్ ముత్తా నవీన్ పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు



కేఎంజే కెనాల్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

కరప: వర్షా కాలంలో ఖరీఫ్ పంట ముంపునకు గురవకుండా పంట, మురుగు కాలువల్లోని గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయిస్తున్నట్టు కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు, ఇరిగేషన్ అధికారులతో కలిసి సోమవారం ఆయన కేఎంజే కెనాల్‌లో పాతర్లగడ్డ సమీపంలో గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించి, మాట్లాడారు. సార్వా పంట ముంపునకు గురవకుండా ఉండేలా, అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెద్దాపురప్పాడు, అరట్లకట్ట, సంపర, పెనుగుదురు తదితర గ్రామాల పరిధిలోని మురుగు, పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగించినట్టు ఆయన తెలిపారు. ఇరిగేషన్ డీఈఈ పి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కేఎంజే కెనాలులో సార్వా, రబీ పంటకాలంలో గుర్రపుడెక్క తొలగించేందుకు రూ.6.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. సాగునీటి సంఘాల ద్వారా ఈ పనులు చేయించడం జరుగుతోందన్నారు. ఇరిగేషన్ ఏఈఈ నాగిరెడ్డి నాగభవానీ, పెనుగుదురు, గొర్రిపూడి నీటి సంఘాల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీను, జోకా అప్పలరాజు, దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, గండి వెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే కుటుంబ సంక్షేమం



పెనుగుదురు వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డీఏఓ డాక్టర్ సుబ్బరాజు

కరప: మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆ కుటుంబం శక్తివంతంగా ఉంటుందన్న ఉద్దేశంతో అమలుచేస్తున్న స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఐఓ(జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి) డాక్టర్ కేవీ సుబ్బరాజు అన్నారు. పెనుగుదురులో సోమవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ అబియాన్ పరివార్ వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. శిబిరంలో కరప పీహెచ్‌సీ డాక్టర్ సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్, డాక్టర్ ధీరజ్ వైద్య సిబ్బందితో కలిసి మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్‌కు సంబంధించిన, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. పెనుగుదురు పీఏసీఎస్ చైర్మన్ రెడ్డిపల్లి నారాయణరావు, బండారు మురళి, పీహెచ్‌సీ సిబ్బంది ఏసురత్నం, డీవీవీ సత్యనారాయణ, సీత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలపై చిన్నచూపు!

- అభివృద్ధిని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- ప్రజలకు అందని సేవలు



రమణయ్యపేటలో అందుబాటులోకి రాని సచివాలయ భవనం

కాకినాడ రూరల్: గ్రామ సుపరిపాలనకు నిదర్శనంగా సచివాలయ వ్యవస్థను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించింది. వీటి కోసం పక్కా భవనాలు నిర్మించి, ఉద్యోగులను నియమించింది. గ్రామ సచివాలయ వ్యవస్థతో పాటు పలు రకాల సేవలు ప్రజల వద్దకే వచ్చాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయ భవనాలు చాలా వరకు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం తక్కువ మొత్తంలో అయ్యే పనులను కూడా పూర్తి చేయకుండా విడిచిపెట్టారు. కొన్ని చోట్ల వినియోగంలోకి తీసుకురాలేదు. కాకినాడ రూరల్ రూరల్ నియోజకవర్గంలో గ్రామస్తులకు సంఖ్యకు అనుగుణంగా మొత్తం 61గ్రామ సచివాలయ భవనాలను అప్పటి ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మంజూరు చేశారు. ఒక్కో సచివాలయ భవనానికి రూ.35 లక్షల నుంచి రూ.42లక్షలు వరకు నిధులు మంజూరు చేశారు. భవనాల తయారీకి నిధులు ఉన్నా పనులు చేపట్టడంలేదు.

భవనాలు లేక ఇబ్బంది

కాకినాడ రూరల్ మండలంలో 40 సచివాలయ భవనాలు, కరప మండలంలో 21 భవనాలు మంజూరు కాగా చాలా వరకు అప్పట్లోనే అందుబాటులోకి వచ్చాయి. రూరల్ మండలంలో సుమారు 10 భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. రమణయ్యపేట గ్రామ పంచాయతీని ఆనుకుని నిర్మించిన సచివాలయ భవనం పనులు పూర్తయినప్పటికి నేటికీ అందుబాటులోకి తీసురాలేదు. గైగోలుపాలు, వాకలపూడి, తూరంగి, ఇంద్రపాలెం, కొవ్వూరు గ్రామాల్లో సచివాలయ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గ్రామ సచివాలయ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, సెక్రటరీ, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, మత్స్యశాఖ అసిస్టెంట్ 11 మంది ఉద్యోగులు సేవలందించేవారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి వివిధ దశల్లో నిలిచిపోయిన భవనాలు వినియోగంలోకి తీసుకువస్తే ఆయా ప్రాంతాల్లో పల్లె ప్రజలకు పక్కా భవనాలతోపాటు సేవలు అందుబాటులోకి తీసువచ్చిన వారవుతారు. గత ప్రభుత్వం చేసిన పనులు తాము చేయకూడదు అనుకుంటే లక్షలు రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్టుగా భావించాల్సి వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

> **అందుబాటులోకి తీసుకొస్తాం**
>
> గ్రామ సచివాయల భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయి వాటిని పూర్త చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఎన్ఆర్ఈజీఎస్ సైట్‌లో అప్‌లోడ్ తీసుకోవడం లేదు. రమణయ్యపేట పంచాయతీ వద్ద సచివాలయం భవనం టైల్స్ వర్క్ మిగిలిపోవడంతో పంచాయతీ నిధులతో పూర్తి చేయించాం. అందుబాటులోకి తీసుకువస్తాం. వలసపాకల సచివాలయ భవనం నిర్మాణ పనులు పంచాయతీ నిధులతో పూర్తి చేస్తాం. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టవల్సిన భవనాలు వివరాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం.
>
> – పి.సతీష్, ఎంపీడీఓ, కాకినాడ రూరల్

మత్స్యకారులకు న్యాయం చేయాలి



ఉప్పాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొత్తపల్లి: తీర ప్రాంతంలో నిర్మించిన కాలుష్య పరిశ్రమల కారణంగా సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద అంతరించిపోతుందని, దీంతో తమ జీవనోపాధికి పూర్తిగా నష్టం వాటిల్లుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉప్పాడలో సోమవారం ఉప్పాడ, అమీనాబాద్‌కు చెందిన మత్స్యకారులు సమావేశం నిర్వహించారు. ఉప్పాడ నుంచి కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. తమ సమస్యలపై నిర్వహించబోయే ఆందోళనకు అనుమతులు ఇవ్వాలని, తహసీల్దార్ చిన్నారావు, ఎస్సై వెంకటేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మత్స్యకార నాయకులు మాట్లాడుతూ, తీర ప్రాంతంలో కాలుష్య పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలను విడుదల చేయడంతో సముద్ర జలాలు పూర్తిగా కలుషితమై గత 6 నెలలుగా మత్స్య సంపద పూర్తిగా తగ్గిపోయిందన్నారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. లేకుండా కుటుంబసభ్యులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా మత్స్యకారుల సమస్యలపై పోరాటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు, నాయకులు ఉమ్మిడి జాన్, మేరుగు యల్లాజీ, సూరాడ రాజు, నక్కా మణికంఠ, చోడిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

బేతాళస్వామి ఊరేగింపు

సామర్లకోట: వేట్లపాలెంలోని బేతాళస్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బేతాళ ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రజలందరూ కలిసి పార్టీల రహితంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయానికి రంగులు, విద్యుద్దీపాలంకరణ చేశారు. గ్రామ శివారులో ఉన్న బేతాళస్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. బేతాళ సంబరం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ నాయకులు కొండపలి జగ్గారావు, సూరన్న చౌదరి, కాకర్ల గంగాధర్, సత్తిబాబు, గుణ్ణం సురేష్, గోలి శ్రీరామ్, గద్దె సాయిరాంల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఐదు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై పోరాటం

సామర్లకోట: దివ్యాంగుల సమస్యలపై పోరాటం చేయడానికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగ విభాగం అధికార ప్రతినిధి పిడుగు కృష్ణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న తనకు రాష్ట్ర స్థాయిలో పదవి లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అనేక మంది సదరన్ సర్టిఫికెట్ల కోసం పేర్లు నమోదు చేయించుకున్నా ఎటువంటి సమాచారం రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సదరన్ సర్టిఫికెట్లు ఆధారంగా దివ్యాంగ పింఛన్లు, రైల్వే, బస్సులలో రాయితీ పాసుల తో ప్రయాణం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత కొత్తగా పింఛన్ల మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. కొత్త పింఛన్ల మంజూరు కోసం అనేక మంది దివ్యాంగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

78 మందికి కంటి వైద్య పరీక్షలు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పిఠాపురం సీఎంసీ వారి ఆధ్వర్యంలో డాక్టరు ఆర్ మున్నా యార్లగడ్డ ట్రినిటీ గాడ్ చర్చిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 14 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 27 మందికి కళ్లజోళ్లు అందజేయగా, మిగిలిన వారికి ఐ డ్రాప్స్ వేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టరు లంక పురుషోత్తందాసు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి వైస్ ప్రెసిడెంట్ ఎల్.జ్ఞానానందం, కోశాధికారి ఎన్.సుకుమార్ సహాయం, యు.రాహుల్, ఆనంద్, సీఎంసీ సిబ్బంది రోగులకు సేవలందించారు.

అధికారుల దృష్టికి మత్స్యకారుల సమస్యలు

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఉప్పాడ, అమీనాబాద్ మత్స్యకార నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. కాలుష్య పరిశ్రమల వల్ల సముద్ర జలాలు కలుషితమై మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతుండడంతో ధర్నా చేసేందుకు నిర్ణయించుకున్నారు. మత్స్యకారులకు సంబంధించి 12 సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఒకరోజు గడువు ఇవ్వాలని నాయకులను అధికారులు కోరారు. మత్స్యకారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులతో చర్చించి చెబుతామని నాయకులు అధికారులకు తెలిపారు. ఈ చర్చల్లో పాడా పీడీ గోపాలరావు, ఆర్డీఓ మల్లిబాబు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ చిన్నారావు, ఎస్సై వెంకటేష్, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.